

**సోమశిలలో 35.825 టీఎంసీలు**

సోమశిల: సోమశిల జలాశయంలో సోమవారానికి 35.825 టీఎంసీలు ఉన్నాయి. జలాశయానికి 104 క్యూసెక్కుల వంతున వరద కొనసాగుతోంది.



**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్లు (10గ్రాములు) | రూ.64,820 |
| 22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా) | రూ.5,821 |
| 3శాతం జీఎస్టీతో | రూ.5,996 |
| సవర (8గ్రా) | రూ.47,968 |

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం
29.4 /22.4

సోమవారం వాతావరణంలో తేమ 74 శాతం ఉంది. చలి వాతావరణం ఉంది. మంగళవారం కూడా వాతావరణంలో పెద్దగా మార్పులుండవు.

## న్యూస్‌రీల్

### చింతలదేవి కామధేను బ్రీడింగ్ సెంటర్ పరిశీలన

కొండాపురం: చింతలదేవి జాతీయ కామధేను బ్రీడింగ్ సెంటర్‌ను ఆ ప్రాజెక్ట్ సీఈఓ ఎం శ్రీనివాసరావు, జాయింట్ కమిషనర్ భూషణ్‌త్యాగిలు సోమవారం సందర్శించారు. కేంద్రంలోని పశువులకు ఏర్పాటు చేసి షెడ్లు, వాటికి కల్పించిన వసతులను పరిశీలించారు. పశువుల మేతకు సాగు చేస్తున్న జొన్న పంట, పిండోత్పత్తి చేసే ఈటీ ల్యాబ్‌ను పరిశీలించి క్షేత్రంలోని అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. 36 ఏళ్లుగా క్షేత్రంలో విధులు నిర్వహిస్తున్న అగ్రికల్చర్ అసిస్టెంట్ శీలం రమణారెడ్డికి జ్ఞాపికను అందజేసి సత్కరించారు. వారి వెంట రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్ విజయ్‌కుమార్, డీడీ పెద్ద స్వామి తదితరులు పాల్గొన్నారు.

### నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు

నెల్లూరు(బారకాసు): క్రీడలను ప్రోత్సహించడంతో పాటు యువతలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఉదయం 10గంటలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి క్రీడా పోటీలను ప్రారంభించనున్నారని నెల్లూరు కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవంలో ప్రజాప్రతినిధులతో పాటు కలెక్టర్, జిల్లా అధికారులు పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# స్మార్ట్‌గా విద్యాబోధన

**1 నుంచి 5వ తరగతి వరకు స్మార్ట్ టీవీలు**

- 6 నుంచి 10వ తరగతి వరకు ఐఎఫ్‌పీలు
- గతేడాది నుంచి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ
- 8వ తరగతి నుంచి ఇంటర్ వరకు బైజూస్ కంటెంట్ అప్‌లోడ్
- జిల్లాలో 19,502 మంది 8వ తరగతి విద్యార్థులు
- 5 వేల మందికి పైగా ఉపాధ్యాయులకు ట్యాబ్‌ల అందజేత
- సచివాలయ అసిస్టెంట్లతో సాంకేతిక సమస్యలకు తక్షణ పరిష్కారం

రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి అధిక ప్రాధ్యానత ఇస్తోంది. సర్కారు బడులను బలోపేతం చేసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. నాడు–నేడు కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తోంది. పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు జగనన్న విద్యాకానుక, గోరుముద్ద, అమ్మఒడి, సీబీఎస్ఈ సిలబస్, డిజిటల్ బోధన, తదితర కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోంది. పేద కుటుంబాల విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాలను అందుకునేలా బోధనా ప్రణాళికలు సిద్ధం చేసి అందుకనుగుణంగా స్మార్ట్‌గా డిజిటల్ బోధనను అందిస్తోంది.



ట్యాబ్‌లను చూపుతున్న 8వ తరగతి విద్యార్థులు

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన ఆధునిక పద్ధతుల్లో సాగుతోంది. నాడు–నేడు ద్వారా సుందరంగా తీర్చిదిద్దిన పాఠశాలల్లో స్మార్ట్‌గా చదువులు సాగుతున్నాయి. 1 నుంచి 5వ తరగతి వరకు స్మార్ట్ టీవీలు, 6 నుంచి ఇంటర్ వరకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్(ఐఎఫ్‌పీ) ద్వారా బోధన అందిస్తున్నారు. 8వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌లు పంపిణీ చేస్తోంది. అందులో 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు బైజూస్ సంస్థకు చెందిన డిజిటల్ పాఠాలను అప్‌లోడ్ చేసి అందజేస్తోంది. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఈ–పాఠశాల యాప్‌ను అప్‌లోడ్ చేసింది. 3వ తరగతి నుంచి ఇంటర్ వరకు పాఠాలను యాప్‌లో అప్‌లోడ్ చేసి ఆ దిశగా బోధన చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా డిజిటల్ బోధన అందిస్తుండడంపై విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**పాఠశాలల్లో ఐఎఫ్‌పీలు, స్మార్ట్ టీవీల ఏర్పాటు**

జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో 1 నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులకు స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తొలి విడతలో 428 స్మార్ట్ టీవీలను జిల్లాకు పంపించారు. వీటిని ఆయా పాఠశాలల్లో ఏర్పాటు చేశారు. మిగిలిన పాఠశాలల్లోనూ త్వరలో స్మార్ట్ టీవీలను ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఉన్న ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ)లను ఏర్పాటు చేస్తున్నారు. తొలి విడతలో జిల్లాలోని 448 పాఠశాలల్లో 1324 ఐఎఫ్‌పీలను ఏర్పాటు చేశారు. త్వరలో మిగిలిన పాఠశాలల్లో కూడా ఐఎప్‌పీలను ఏర్పాటు చేయనున్నారు. వీటి ద్వారా విద్యార్థులకు డిజిటల్ బోధన అందించనున్నారు.

**8వ తరగతికి ట్యాబ్‌ల పంపిణీ**

డిజిటల్ బోధన అందించేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తున్నారు. 2021–22 విద్యా సంవత్సరానికి 18,153 మందికి 2022–23 విద్యా సంవత్సరానికి 19,502 మందికి ట్యాబ్‌లు అందజేశారు. వీరితో పాటు 4వేల మందికి పైగా ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను అందజేశారు. ఈ ట్యాబ్‌లో బైజూస్ సంస్థ 8వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పాఠాలను అప్‌లోడ్ చేసింది. గతేడాది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా డిజిటల్ బోధన అందించగా, ఈ విద్యా సంవత్సరం 9వ తరగతి విద్యార్థులకు బైజూస్ డిజిటల్ పాఠాలను బోధిస్తున్నారు. వచ్చే ఏడాది నుంచి 10వ తరగతి విద్యార్థులకు డిజిటల్ బోధన అందించనున్నారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ట్యాబ్‌ల్లో ఈ పాఠశాల యాప్‌ను సైతం అప్‌లోడ్ చేసి దానిలో 3వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పాఠాలను అప్‌లోడ్ చేసింది.

**ట్యాబ్‌ల్లో సాంకేతిక సమస్యలపై పర్యవేక్షణ**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందజేసిన ట్యాబ్‌లలో తలెత్తే సాంకేతిక సమస్యలపై అధికారులు పర్యవేక్షించనున్నారు. ట్యాబ్‌ల సమస్యల పరిష్కారం కోసం ఆయా సచివాలయాల్లోని ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అండ్ డిజిటల్ అసిస్టెంట్లను నియమించారు. ట్యాబ్‌ల్లో సమస్యలు వచ్చిన విద్యార్థులు సంబంధిత సచివాలయాలకు వెళ్లి వారిని కలిస్తే సంబంధిత సమస్యపై ఫిర్యాదు నమోదు చేసి టికెట్ నంబరును సంబంధిత విద్యార్థికి ఇస్తారు. అనంతరం ట్యాబ్‌ను సంబంధిత షోరూంకు తీసుకెళ్లి రిపేరు చేయించి విద్యార్థికి అందజేస్తారు.

**బైజూస్ కంటెంట్‌ను అప్‌లోడ్ చేస్తారు**

ప్రభుత్వం అందజేస్తున్న ట్యాబ్‌లో ఇంటర్మీడియట్ వరకు బైజూస్ సంస్థ పాఠాలను అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ విధానం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ట్యాబ్‌ల్లో డిజిటల్ బోధనపై ఇప్పటికే ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చాం. విద్యార్థులు కూడా ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకోవాలి. పాఠశాలలో బోధించిన పాఠాన్ని విద్యార్థులు మళ్లీ ఇంటి వద్ద ట్యాబ్‌ల ద్వారా రివిజన్ చేసుకోవాలి. తద్వారా ఆశించిన ఫలితాలు వస్తాయి.

– గంగాభవాని, డీఈఓ

**డిజిటల్ బోధనపై పర్యవేక్షణ**

ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న డిజిటల్ బోధనపై రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షించనున్నారు. విద్యార్థులు ట్యాబ్‌లో ఉన్న పాఠాలను ప్రతిరోజూ చదవాల్సి ఉంటుంది. ప్రతి శుక్రవారం ట్యాబ్‌లకు 10 నుంచి 15 నిమిషాల పాటు ఇంటర్నెట్‌ను కనెక్ట్ చేయాల్సి ఉంటుంది. ఆ సమయంలో ట్యాబ్‌లో పాఠాలను సంబంధిత విద్యార్థి ఎంతసేపు చదివారు, ఎన్ని పాఠాలను చూశారన్న ఆన్‌లైన్ డేటా ద్వారా సమాచారం ఉన్నతాధికారులకు చేరుతుంది. ఈ సమాచారాన్ని పరిశీలించి రాష్ట్ర విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాలల హెడ్‌మాస్టర్లను అప్రమత్తం చేయనున్నారు. విద్యార్థులు ట్యాబ్‌లో ఉన్న పాఠాలను చదివే విధంగా చర్యలు తీసుకోవాలని హెడ్‌మాస్టర్లకు సమాచారం పంపనున్నారు. ఉపాధ్యాయులు కూడా ట్యాబ్‌లో అప్‌లోడ్ చేసిన పాఠాలను విద్యార్థులు చదువుతున్నారా..లేదా అన్న దానిపై ప్రతిరోజూ పర్యవేక్షించాల్సి ఉంటుంది. కార్పొరేట్ పాఠశాలల కంటే మిన్నగా ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన అందిస్తుండడంపై విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

# సామాజిక పట్టాభిషేకం

- జగనన్న పాలనలో బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట
- నేడు నార్తురాజుపాళెంలో సాధికార బస్సు యాత్ర

కోవూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సాహసోపేత నిర్ణయాలతో సామాజిక చైతన్యాన్ని తీసుకొచ్చారు. అట్టడుగు వర్గాల ప్రజలకు పదవులు ఇచ్చి సమాజంలో వారికి గౌరవాన్ని పెంచారు. సంక్షేమ పథకాలను అమలు చేస్తూ వారి అభ్యున్నతికి తోడ్పాటును అందించారు. సాధికారతను సాకారం చేసి బడుగు, బలహీన వర్గాల ప్రజల జీవితాల్లో సరికొత్త వెలుగులు నింపారు. గతంలో బడుగు, బలహీన వర్గాలను టీడీపీ ఓటు బ్యాంకుగా మాత్రమే వాడుకుని వదిలేసేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వారి అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేసింది. 56 కార్పొరేషన్లను ఏర్పాటు చేసి ఆయా వర్గాల వారికి పదవులు ఇచ్చింది. నామినేటెడ్ పోస్టుల్లోనూ 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఇచ్చింది. బీసీలు అంటే వెనుకబడిన కులాలు కాదని, వెన్నుముకగా నిలిచే వర్గాలు అని పలుమార్లు ఉద్ఘాటించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆ మాటలను ఆచరణలోకి తీసుకొచ్చి సామాజిక పట్టాభిషేకం చేసి మన్ననలు పొందారు. గడిచిన నాలుగున్నరేళ్ల పాలనలో ఆయన బడుగు, బలహీన వర్గాలకు అన్ని రంగాల్లో పెద్దపీట వేసి భరోసా కల్పించారు. చేసిన మేలును వివరించేందుకు మంగళవారం కోవూరు నియోజకవర్గంలోని నార్తురాజుపాళెంలో సామాజిక సాధికార బస్సు యాత్రను నిర్వహిస్తున్నారు. అందుకు సంబంధించి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పర్యవేక్షణలో వైఎస్సార్‌సీపీ నాయకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. సభా స్థలం, పార్కింగ్ ప్రదేశాలు, తదితర ఏర్పాట్లను నాయకులు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు పరిశీలించారు. మూడు దిక్కులా నాలుగు కిలోమీటర్ల మేర భారీ కటౌట్‌లు, రోడ్డుకు ఇరువైపులా పార్టీ తోరణాలు, ఫ్లెక్సీలు, స్వాగత ద్వారాలు ఏర్పాటు చేశారు. టపాతోపు రైల్వే గేటు వద్ద నుంచి నార్తురాజుపాళెం సెంటర్‌లోని సభా స్థలం వరకు సామాజిక సాధికార బస్సుయాత్ర జరుగనుంది. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా రాజ్యసభ సభ్యులు వేణుంబాక విజయసాయి రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, బీద మస్తాన్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ హాజరుకానున్నారు. ముఖ్యఅతిథులుగా కందుకూరు ఎమ్మెల్యేలు ఎం మహీధర్‌రెడ్డి, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి విక్రమ్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీలు తుమాటి మాధవరావు, ఉదయగిరి వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఎం రాజగోపాల్‌రెడ్డి, తదితరులు రానున్నారు. సభా వేదికపై ఉపముఖ్యమంత్రి పీ రాజన్నదొర, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున, నెల్లూరు నగర ఎమ్మెల్యే పీ అనిల్‌కుమార్‌యాదవ్, ప్రముఖ సినీనటుడు అలీ, కర్నూలు మాజీ ఎంపీ బుట్టా రేణుక, కర్నూలు ఎమ్మెల్యే అబ్దుల్ హాఫీజ్‌ఖాన్, నెల్లూరు మేయర్ పీ స్రవంతిజయవర్ధన్, తదితరులు ప్రసంగించనున్నారు.



నార్తురాజుపాళెం రోడ్డులో సామాజిక సాధికార యాత్రకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

**సామాజిక న్యాయం**

బడుగు, బలహీన వర్గాల నాయకులకు పదవులు కల్పించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక న్యాయం పాటించారు. మత్స్యకార నాయకుడు కొండూరు అనిల్‌బాబుకు ఆప్కాబ్ చైర్మన్‌గా అవకాశం కల్పించారు. ఇందుకూరుపేట మండలానికి చెందిన బీసీ నాయకుడు గొల్లపల్లి విజయ్‌కుమార్‌కు రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా అవకాశం కల్పించారు. జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలిగా మత్స్యకార మహిళ శ్రీహరికోట జయలక్ష్మిని కూర్చోబెట్టారు. ఇందుకూరుపేట మండల పరిషత్ ఉపాధ్యక్ష పదవులకు బీసీ వర్గానికి చెందిన కైలాసం లావణ్య, అద్దంకి మమతను ఎన్నిక చేశారు. కోవూరు మండల ఉపాధ్యక్షుడిగా గండవరం సాయిలక్ష్మికి అవకాశం కల్పించారు. పార్టీ పదవులను సైతం బీసీ వర్గాలకు కేటాయించి వారి పక్షపాతిగా సీఎం జగన్ నిలిచారు. బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన పుట్టా ధనలక్ష్మిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. జొన్నవాడ ఆలయ మాజీ చైర్మన్‌గా చీమల రమేష్ బాబు పనిచేశారు. కొడవలూరు మండలం నుంచి ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వీరి చలపతిరావుకు డీసీఎమ్మెస్ చైర్మన్‌గా అవకాశం కల్పించారు.

**యాత్ర షెడ్యూల్ ఇలా..**

సామాజిక సాధికార యాత్ర మధ్యాహ్నం 3 గంటలకు టపాతోపు వద్ద నుంచి ప్రారంభమవుతుంది. 3.45 గంటలకు రాజుపాళెం సెంటర్‌కు చేరుకుంటుంది. అక్కడ వైఎస్సార్ కాంస్య విగ్రహాన్ని రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి ఆవిష్కరిస్తారు. అనంతరం 4.10 నుంచి 5.30 గంటల వరకు బహిరంగ సభ జరుగుతుంది. 5.30 నుంచి 5.45 గంటల వరకు రాజుపాళెం సెంటర్‌లో నూతనంగా నిర్మించిన సెంట్రల్ లైటింగ్‌ను ప్రారంభిస్తారు.

# యాత్రను విజయవంతం చేయాలి

- ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కొడవలూరు: నార్తురాజుపాళెంలో మంగళవారం జరిగే సామాజిక సాధికార బస్సు యాత్రలో ప్రతిఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. నార్తురాజుపాళెంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. యాత్రకు కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి సమారు 20 వేల మంది తరలి రానున్నారని తెలిపారు. వారి కోసం 230 బస్సులు, 600 ఆటోలు, 300 కార్లు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను కేటాయించామన్నారు. యాత్ర ఎక్కడ ఆరంభమవుతుంది, పార్కింగ్ ప్రదేశాలు, తదితరాలను సూచిస్తూ బోర్డులను ఏర్పాటు చేశామన్నారు. యాత్ర విజయవంతంగా జరిగేలా నాయకులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. వాహనాల్లో వచ్చే వారిని తిరిగి జాగ్రత్తగా ఇంటికి చేర్చే బాధ్యత నాయకులపైనే ఉందన్నారు. యాత్రకు వచ్చే వారు క్రమశిక్షణను పాటించాలన్నారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశామని తెలిపారు. యాత్రకు వచ్చే వారంతా మధ్యాహ్నం 2 గంటల్లోపు టపాతోపు అండర్ బ్రిడ్జి సమీపంలో కేటాయించిన ఖాళీ స్థలం వద్దకు చేరుకోవాలని సూచించారు. అక్కడి నుంచే నిర్దేశించిన సమయానికే యాత్రను ప్రారంభిస్తామని తెలిపారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల కోసం చేపడుతున్న యాత్రను ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏపీఎల్డీఏ, డీఏబీ చైర్మన్లు జీ విజయకుమార్, డీ నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పీ రాధాకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, దువ్వూరు కళ్యాణ్‌రెడ్డి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు రజత్‌కుమార్‌రెడ్డి, మండల కన్వీనర్లు జీ వెంకటశేషయ్య, బీ గోవర్ధన్‌రెడ్డి, ఎం శ్రీనివాసులురెడ్డి, సతీష్‌రెడ్డి, ఎంపీపీ జీ జ్యోతి, సర్పంచ్, ఉపసర్పంచ్‌లు బీ సుప్రియ, వీ కళైవాణి, నాయకులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్న






నెల్లూరులోని సంతపేట ఆర్సీఎం చర్చిలో బాలయేసు సప్ర మహోత్సవం, హాజరైన క్రైస్తవులు

# క్రీస్తు జననం.. లోక పావనం

జిల్లా వ్యాప్తంగా సోమవారం క్రిస్మస్ సంబరాలు అంబరాన్ని అంటాయి. చర్చిలు, ప్రార్థనా మందిరాలు కళకళలాడాయి. యేసు జననాన్ని ఆహ్వానిస్తూ ఆదివారం అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. క్రైస్తవ మతపెద్దలు క్రిస్మస్ సందేశాన్ని ఇచ్చారు. నెల్లూరు నగరంలో బాలయేసు సప్ర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు





# క్రిస్మస్ సంబరాలు

క్రిస్మస్ సంబరాలు అంబరాన్నంటాయి. పండగను సోమవారం క్రైస్తవులు ఘనంగా చేసుకున్నారు. జిల్లాలోని చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. నెల్లూరు నగరంలోని వీఆర్సీ సెంటర్ వద్ద ఉన్న బాప్టిస్ట్ చర్చి డౌనీ హాల్, సంతపేటలోని ఆర్సీఎం చర్చి, ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న ఏబీఎం కాంపౌండ్‌లోని ది లోన్‌స్టార్ చర్చి, గౌతమినగర్‌లోని ది యునైటెడ్ క్రిస్టియన్ చర్చి, తోటపల్లిగూడూరు మండలం వేళాంగణిమాత చర్చిలో తదితర చోట్ల జరిగిన ప్రార్థనలకు క్రైస్తవులు పెద్దఎత్తున హాజరయ్యారు. యువత భక్తిగీతాలను ఆలపించింది. సేవా కార్యక్రమాలు విస్తృతంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు చర్చిల్లో జరిగిన వేడుకల్లో పాల్గొని పండగ శుభాకాంక్షలు తెలిపారు.

– సాక్షి, నెట్‌వర్క్



టీపీగూడూరు: కోడూరు వేళాంగణిమాత చర్చిలో జరిగిన ప్రార్థనల్లో పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



ముత్తుకూరు: పిడతాపోలూరులో బొమ్మలతో ఏర్పాటు చేసిన క్రీస్తు జన్మ వృత్తాంతం



నెల్లూరు సంతపేట చర్చిలో..



బాలఏసు వద్ద ప్రార్థనలు



నెల్లూరు రూరల్ నియోజకవర్గం వెంగళరావునగర్‌లో దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



నెల్లూరు: సంతపేట ఆర్సీఎం చర్చిలో సప్ర మహోత్సవంలో భాగంగా రథం లాగుతున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్



ది యునైటెడ్ క్రిస్టియన్ చర్చిలో భక్తిగీతాలు ఆలపిస్తున్న యువతులు



నెల్లూరు: ఏబీఎన్ కాంపౌండ్‌లోని ది లోన్‌స్టార్ చర్చిలో జరిగిన ప్రార్థనలో పాల్గొన్న భక్తులు



కావలి: కేక్ కట్ చేసి తినిపిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి



ఉదయగిరి: చర్చిలో కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

## క్లుప్తంగా

### స్క్వే మార్షల్ ఆర్ట్స్‌లో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన వారితో నిర్వాహకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): చిత్తూరులో జరిగిన రాష్ట్రస్థాయి స్క్వే మార్షల్ ఆర్ట్స్‌లో జిల్లాకు పతకాలు వచ్చాయి. సోమవారం స్క్వే మార్షల్ ఆర్ట్స్ జిల్లా సెక్రటరీ వి.ఆదినారాయణ వివరాలు వెల్లడించారు. ఈనెల 24వ తేదీన స్క్వే మార్షల్ ఆర్ట్స్ రాష్ట్రస్థాయి పోటీలు చిత్తూరు జిల్లాలో జరిగాయి. వీటికి జిల్లా నుంచి అండర్–11, 14, 19 విభాగాల్లో బాలబాలికలు హాజరయ్యారు. కటా, ఫైటింగ్ విభాగాల్లో 20 మంది పాల్గొనగా 8 బంగారు, 8 సిల్వర్, 4 బ్రాంజ్ మెడల్స్‌ను సాధించారని తెలిపారు.

### సంగంలో శోభాయాత్ర



శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

సంగం: మండల కేంద్రమైన సంగం శివాలయంలో సోమవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా శోభాయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజరాజేశ్వరీదేవి జ్ఞానపీఠం పీఠాధిపతులు రాజరాజేశ్వరానందస్వామి విచ్చేశారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండరిభజన ఆకట్టుకుంది. అనంతరం శివాలయం నుంచి శోభాయాత్రను ప్రారంభించారు. గ్రామ పురవీధుల్లో జై శ్రీరాం నినాదాలతో యాత్ర జరిగింది.

### సైకిల్‌పై వెళ్తుండగా..

- గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



వెంకటేశ్వర్లు మృతదేహం

ఉలవపాడు: సైకిల్‌పై వెళ్తున్న వ్యక్తిని వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన జాతీయ రహదారిపై ఉలవపాడు ఉత్తర బైపాస్‌లోని చిల్లకాల్వ బ్రిడ్జి వద్ద సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఉలవపాడు పంచాయతీ పరిధిలో కొల్లూరుపాడుకు చెందిన దామతోటి వెంకటేశ్వర్లు (65) తన సైకిల్‌పై మన్నేటికోట రోడ్డు వద్ద మామిడితోటలో పనికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెనుక నుంచి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## సీఎం సహాయనిధి పేదలకు వరం

- ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): పేద, మధ్య తరగతి ప్రజలకు ముఖ్యమంత్రి సహాయనిధి వరంలా మారిందని, ఆపదకాలంలో అండగా నిలుస్తోందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. చేజర్ల మండలం నాగులవెలటూరు గ్రామానికి చెందిన ఇనుకుర్తి విజయ్‌బాబు అనారోగ్యంతో ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్నాడు. సీఎంఆర్‌ఎఫ్ మంజూరు చేయించాలని అతను ఎమ్మెల్యేకు విన్నవించారు. దీంతో ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన రూ.65 వేల చెక్కును ఎమ్మెల్యే సోమవారం నెల్లూరు మేకపాటి కార్యాలయంలో బాధితుడికి అందజేశారు. పేదలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉన్నారన్నారు.



సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

## ఆలిండియా ఓపెన్ చెస్ విజేత గుణశేఖరన్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏపీసీఏ సెక్రటరీ కప్, ఆలిండియా ఓపెన్ చెస్ క్రీడా పోటీల్లో విజేతగా ఫీడే మాస్టర్ గుణశేఖరన్ (తమిళనాడు) నిలిచినట్లు డాట్ లింకప్ చైర్మన్ పెంచలభాస్కర్, డైరెక్టర్ బాలకృష్ణ తెలిపారు. డాట్ లింకప్, ఆర్‌ఎల్ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని రంగనాయకులపేటలో ఉన్న ది ఆర్యవైశ్య బులియన్ మర్చంట్స్ పాన్ బ్రోకర్స్ అసోసియేషన్ కల్యాణ మండపంలో జరుగుతున్న ఏపీసీఏ సెక్రటరీ కప్, ఆలిండియా ఓపెన్ చెస్ పోటీలు సోమవారంతో ముగిశాయి. విజేతగా ఫీడే మాస్టర్ గుణశేఖరన్, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఫీడే మాస్టర్ ఆదిత్య వరుణ్ (తెలంగాణ) నిలిచారు. నాలుగు, ఐదు స్థానాలను ఇంటర్నేషనల్ మాస్టర్ కుశగ్ర మొహన్ (వైజాగ్), ఇంటర్నేషనల్ మాస్టర్ రవితేజ (విజయవాడ), ఫీడే మాస్టర్ సయ్యద్ అన్వర్ షాజులీ (తమిళనాడు) సాధించారన్నారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రైడ్ అధ్యక్షుడు కార్తీక్, హైకోర్టు న్యాయవాది దేవరం శ్రీహరి, రామ్ లక్ష్మణ్, ప్రదీప్, అనీస్, సత్యనారాయణ, విజయ్, వంశీ, గోపీనాథ్, రాష్ట్ర చెస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సుమన్ తదితరులు పాల్గొన్నారు.




విజేతలతో నిర్వాహకులు

## ముగిసిన మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు



పురుషుల పరుగు పందెం




పతకాలు సాధించిన వారు

- ఓవరాల్ చాంపియన్‌గా నెల్లూరు

ఉలవపాడు: 43వ రాష్ట్రస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్‌గా నెల్లూరు జిల్లా నిలిచింది. రామాయపట్నం చర్చి గ్రౌండ్‌లో రెండు రోజులుగా జరుగుతున్న పోటీలు సోమవారంతో ముగిశాయి. బహుమతుల ప్రదానోత్సవం జరిగింది. మహిళల 1,500 మీటర్ల విభాగంలో 50 ఏళ్ల పైన కె.రత్తమ్మ (నెల్లూరు), పెంచలమ్మ (నెల్లూరు), 55 ఏళ్ల పైన లక్ష్మి (నెల్లూరు), 60 ఏళ్ల పైన కోటేశ్వరమ్మ (నెల్లూరు), 400 మీటర్ల విభాగంలో 30 ఏళ్ల పైన లక్ష్మి (నెల్లూరు), 40 ఏళ్ల పైన రజని వైశాలిని (నెల్లూరు), 50 ఏళ్ల పైన ప్రవీణదేవి (నెల్లూరు), రత్తమ్మ (నెల్లూరు), 55 ఏళ్ల పైన పద్మావతి (నెల్లూరు) విజేతలుగా నిలిచారు. మహిళల రిలే పరుగు పందెంలో నెల్లూరు జట్టు విజయం సాధించింది. 45 ఏళ్ల పైన పురుషుల విభాగంలో 400 మీటర్ల పరుగు పందెంలో టి.వెంకటేశ్వర్లు (కృష్ణా), టీకే మల్లికార్జున (కృష్ణా), ఈశ్వరరావు (ప్రకాశం) 40 ఏళ్ల పైన కేవీ నాగులు (కృష్ణా), ఎంవీ నరసయ్య (కృష్ణా), షేక్ సజీత్ (నెల్లూరు), 35 ఏళ్ల పైన ప్రభాకర్ (ప్రకాశం), 30 ఏళ్ల పైన వెంకటరావు (ప్రకాశం), 1500 మీటర్ల పరుగు పందెం 30 ఏళ్ల పైన డి.గోవిందరావు (విజయనగరం), బి.రామారావు (విజయనగరం), 40 ఏళ్ల పైన రామరాజు (తూర్పుగోదావరి), ఎస్ రవిబాబు (కృష్ణా), ఈ సుధాకర్ (నెల్లూరు), 45 ఏళ్ల పైన ఎస్.వెంకటేశ్వరరావు (విజయనగరం), సూర్యనారాయణ (విజయనగరం), 50 ఏళ్ల పైన పైన కె.జనార్దనరావు (విజయనగరం), జి.వెంకట్రావు (నెల్లూరు), రామిరెడ్డి (ప్రకాశం), 55 ఏళ్ల పైన వెంకట్రావు (తూర్పుగోదావరి), ప్రకాష్ (విశాఖపట్నం), 65 ఏళ్ల పైన మోహన్‌కుమార్ (కృష్ణా), 400 మీటర్లు 80 ఏళ్ల పైన ఎంఎస్ఎన్ మూర్తి (విజయనగరం), 70 ఏళ్ల పైన ఈ.భాస్కర్‌రెడ్డి (నెల్లూరు) 60 ఏళ్ల పైన రాజు (నెల్లూరు), సంధ్యారావు (విశాఖపట్నం), 55 ఏళ్ల పైన నాగబాబు (తూర్పుగోదావరి), వెంకటరావు (తూర్పుగోదావరి), చౌదరి (కృష్ణా), 50 ఏళ్ల పైన అప్పలస్వామి (కృష్ణ), పైడిరాజు (విజయనగరం), మస్తానయ్య (నెల్లూరు) విజయం సాధించారు. హామర్ త్రో విభాగంలో మహిళలు కె.సీతా మహాలక్ష్మి (విశాఖపట్నం), ఎస్.అంజమ్మ (నెల్లూరు), పురుషుల విభాగంలో కె.జీవన్ కుమార్ (ప్రకాశం), మురళి (ప్రకాశం), డీటీ శశికుమార్ (విశాఖపట్నం), షాట్‌పుట్‌లో జీవన్‌కుమార్ (ప్రకాశం), మురళి (ప్రకాశం), జావెలిన్‌త్రోలో జీవన్‌కుమార్ (ప్రకాశం), మురళి (ప్రకాశం) విజయం సాధించారు. ఓవరాల్ చాంపియన్‌గా నెల్లూరు, వ్యక్తిగత చాంపియన్‌గా జీవన్‌కుమార్ (ప్రకాశం)లు ఎంపికయ్యారు.

## చందన, సీఎంఆర్ టాటా కారు విజేత పూర్ణ

నెల్లూరు(బృందావనం): క్రిస్మస్, న్యూ ఇయర్, సంక్రాంతి సందర్భంగా చందన, సీఎంఆర్ ప్రవేశపెట్టిన పండగ సంబరాలకు సంబంధించి టాటా టియాగో కారు డ్రాను సోమవారం నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తీశారు. నెల్లూరులోని కనకమహల్ సెంటర్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఇనమడుగుకు చెందిన ఎ.పూర్ణ (కూపన్ నంబర్ 31690)ను విజేతగా ప్రకటించారు. ఇంకా గత రెండు వారాల లక్కీ డ్రాకు సంబంధించి టీవీఎస్ మోటార్‌బైక్ విజేతలకు తాళాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆదాల మాట్లాడుతూ చందన, సీఎంఆర్‌లు నెల్లూరు ప్రజలకు తక్కువ ధరలకే నాణ్యమైన వస్త్రాలు, బంగారు ఆభరణాలను అందజేస్తున్నాయన్నారు. పండగల సందర్భంగా విలువైన కార్లు, మోటార్‌బైక్‌లు, గ్రైండర్లు, మిక్సీలు తదితరాలు ఇవ్వడం విశేషమన్నారు. గత వారం డైలీ డ్రా విజేతలైన 35 మందికి వస్తువులను విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నెల్లూరు అగ్రికల్చర్ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి, సుబ్బారెడ్డి, నాగిరెడ్డి, సురేష్‌రెడ్డి, హరిబాబు, సీఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు, రాజీ యాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, శైలేష్, వాసు పాల్గొన్నారు.



డ్రా తీసిన నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

### నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

| | |
|---|---|
| బ్రాయిలర్ (లైవ్) | : 109 |
| లేయర్ (లైవ్) | : 100 |
| బ్రాయిలర్ చికెన్ | : 196 |
| బ్రాయిలర్ స్కిన్‌లెస్ | : 216 |
| లేయర్ చికెన్ | : 170 |

### నిమ్మ ధరలు పొదలకూరు (కిలో)

| | |
|---|---|
| పెద్దవి | : రూ. 21 |
| సన్నవి | : రూ.15 |
| పండ్లు | : రూ. 5 |

